www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | పేజీలు: 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 20 సంచిక (Issue) : 333 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె.ఉ.6.28; దుర్ముహూర్తం: మ.12.40-1.32, మ.3.16-4.09; అమృతఘడియలు: మ.2.54-4.36; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | నల్లగొండ

Nallagonda | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nizamabad and Bengaluru



తెలుగు రాష్ట్రాలు గర్వించేలా... తెలుగు విద్యార్థి గర్వపడేలా...
Infinity Learn
IIT JEE ADVANCED ఫలితాల్లో శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థుల విశ్వరూపం
(మాదాపూర్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్‌లు)
ALL-INDIA ALL CATEGORY BELOW 10 RANKS
ఆలిండియా 1 RANK BIBASWAN BISWAS* H.T. NO: 245058146 (SC)
ఆలిండియా 3 RANK SALLURI VIVEK H.T. NO: 246133127 (SC)
ఆలిండియా 4 RANK VASANTA SRIRAJ H.T. NO: 246162238 (ST)
ఆలిండియా 5 RANK HIMANSHU THALOR* H.T. NO: 242050438 (OBC)
ఆలిండియా 6 RANK RAJDEEP MISHRA* H.T. NO: 241016176
ఆలిండియా 8 RANK P V S D SAI MOHITH H.T. NO: 246008172 (EWS)
ఆలిండియా 9 RANK M E VENKATA PARTHIV H.T. NO: 246162250 (EWS)
ఆలిండియా 10 RANK A S S D B SIDHVIK SUHAS H.T. NO: 246119101
ఆలిండియా ఓపెన్ కేటగిరిలో శ్రీచైతన్య సాధించిన టాప్ 1000లోపు 203 ర్యాంకులు
106 112 120 122 123 124 125 135 142 145 149
150 152 154 156 160 164 165 167 169 172 175
178 180 181 183 185 192 204 206 207 210 213
214 215 219 223 224 227 228 233 235 238 242
244 248 249 252 253 259 260 264 274 275 283
297 299 304 308 311 318 326 333 334 339 353
355 369 379 384 393 395 399 401 402 405 406
410 420 421 431 435 436 440 454 465 467 470
481 484 494 495 508 509 519 522 525 544 551
556 573 579 591 599 600 604 617 620 645 647
658 662 670 671 685 690 693 694 696 704 708
712 713 714 716 720 724 725 729 740 764 767
772 779 780 784 787 792 795 802 803 804 807
808 809 813 836 838 839 844 845 846 852 873
874 879 880 891 898 899 909 926 928 929 935
944 945 973 976 997 998 999 1000
RANK
Congratulations
IIT-JEE MAIN & ADVANCED
LONGTERM 2025
క్లాసులు 15 జూన్ 2024 నుండి ప్రారంభం
ADMISSIONS OPEN
HYDERABAD
BOYS RESIDENTIAL - 91000 65899 / 91774 22235 87126 00768 / 87126 00769
GIRLS RESIDENTIAL - 91770 46533 / 91000 91871 89779 05063 / 89779 05064
DAY SCHOLARS - 99486 76603 / 98661 08338
ALL INDIA / STATE RANKS | JEE MAIN-2024 | JEE ADV-2024 | AP EAPCET | TS EAPCET
<=2500 | 100% | 100% | 80% | 80%
<=5000 | 100% | 100% | 60% | 60%
<=10000 | 75% | 75% | 30% | 30%
<=20000 | 50% | 50% | 20% | 20%
SC/ST/PW BEST RANKERS | 60% | 60%
*Best of one is taken into Consideration
Scan QR code for WEBSITE
ADMISSIONS OPEN
Knowledge Hub
NEET | IIT JEE | FOUNDATION
COACHING CENTRES
www.srichaitanyaknowledgehub.com
KUKATPALLY : 91774 44352
AMEERPET : 95151 11054
KONDAPUR : 95151 11428
VISAKHAPATNAM : 91774 44307
DILSUKHNAGAR : 91774 44326
HIMAYATNAGAR : 91774 44341
TRIMULGHERRY : 91774 44837

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | పేజీలు:10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 20 సంచిక (Issue) : 333 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తే.ఉ.6.28; దుర్ముహూర్తం: మ.12.40-1.32, మ.3.16-4.09; అమృతఘడియలు: మ.2.54-4.36; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | నల్లగొండ***

Nallagonda | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nizamabad and Bengaluru

పట్టభద్రుల స్థానంలో తొలిసారి
కాంగ్రెస్ పాగా

- తాజా ఉప ఎన్నికలో గెలుపొందిన తీన్మార్ మల్లన్న
- బీజేపీ అభ్యర్థి ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో బీఆర్ఎస్ అభ్యర్థికే ఆధిక్యత
- 30వేల ఓట్లు సాధించిన స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్

శాసనమండలి ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల స్థానంలో మొదటిసారి కాంగ్రెస్ పాగా వేసింది. 2007లో శాసనమండలి పునరుద్ధరణ తర్వాత ఇప్పటివరకు జరిగిన ఐదు ఎన్నికల్లో, మొదటి నాలుగింటిలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించగా, తాజా ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న) ఎమ్మెల్సీగా గెలుపొందారు.

ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ



ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు ధ్రువపత్రం అందుకుంటున్న తీన్మార్ మల్లన్న

ప్రశ్నించే గొంతుకగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాడిన మల్లన్న మూడో ప్రయత్నంలో విజయం సాధించారు. 2016లో తొలిసారిగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. 2021లో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి ద్వితీయ స్థానంలో నిలిచారు. మూడో ప్రయత్నంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఎమ్మెల్సీగా మల్లన్న 2027 మార్చి 29 వరకు కొనసాగుతారు. పట్టభద్రుల నియోజకవర్గం విస్తరించి ఉన్న 12 జిల్లాల్లో ఆయనకు ఎమ్మెల్సీగా ప్రోటోకాల్ వర్తిస్తుంది. 2021లో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొంది, ఈ స్థానానికి రాజీనామా చేయడంతో తాజా ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగు రాకేష్‌రెడ్డి, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా పాలకూరి అశోక్‌కుమార్, బక్క జడ్సన్‌తో పాటు మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్), ఏనుగురాకేష్‌రెడ్డి నడుమ గట్టిపోటీ కొనసాగగా, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. నల్లగొండకు చెందిన స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కుమార్ నాలుగో అభ్యర్థిగా నిలిచినా ప్రధాన పార్టీల అభ్యర్థులకు ధీటుగా 29,697 మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించారు.

2021 కంటే పెరిగిన చెల్లని ఓట్లు

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో చెల్లని ఓట్లు భారీగా నమోదవడంపై మేధావివర్గం నుంచి విమర్శలు వస్తున్నాయి. మొత్తం 3,38,179 ఓట్లు పోలవ్వగా 8.25శాతం అంటే 27,990 ఓట్లు చెల్లకుండా పోయాయి. 2021లో మాత్రం ఈ సంఖ్య తక్కువగా ఉంది. ఆ ఎన్నికలో 2,79,970 ఓట్లు పోల్‌కాగా, 5.54శాతం అంటే 15,533 ఓట్లు చెల్లకుండా పోయాయి.

2021లో, ప్రస్తుత ఎన్నికలో అభ్యర్థులు సాధించిన మొదటి ప్రాధాన్య ఓట్లు

పార్టీ	2021లో అభ్యర్థి	వచ్చిన ఓట్లు	2024లో అభ్యర్థి	వచ్చిన ఓట్లు
కాంగ్రెస్	రాములు నాయక్	27,713	తీన్మార్ మల్లన్న	1,22,813
బీఆర్ఎస్	పల్లా రాజేశ్వర్‌రెడ్డి	1,11,190	ఏనుగుల రాకేష్‌రెడ్డి	1,04,248
బీజేపీ	గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి	39,268	గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి	43,313
టీజేఎస్	కోదండరామ్	70,472	-	
సీపీఐ	జయసారథిరెడ్డి	8,732	-	
స్వతంత్ర	తీన్మార్‌మల్లన్న	83,629	పాలకూరి అశోక్‌కుమార్	29,697
చెల్లనివి		15,533	చెల్లనివి	27,990

ద్వితీయ ప్రాధాన్య ఓట్లపై బీఆర్ఎస్ ఆశలు గల్లంతు

ఎమ్మెల్సీ ఎన్నిక పోరు ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. తొలి ప్రాధాన్య ఓట్లలో చెల్లని ఓట్లు 8.25 శాతం నమోదయ్యాయి. గ్రాడ్యుయేట్లు అయినా, ఓటు వేయడంలో పొరపాట్లు చేయడాన్ని మేధావులు విమర్శిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఇలా వ్యవహరించారనే వాదనా ఉంది. స్వతంత్ర అభ్యర్థుల ఎలిమినేషన్ రౌండ్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో సైతం మొదటి ప్రాధాన్యంలో ఆధిక్యత సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకే ఆధిక్యత దక్కింది. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్‌లో మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 5,232 ఓట్ల ఆధిక్యత వచ్చింది. అయితే అప్పటికే మల్లన్నే 14,722 ఓట్ల ఆధిక్యంలో ఉండడంతో ఎన్నికల సంఘం అధిక ఓట్లు సాధించిన మల్లన్ననే విజేతగా ప్రకటించింది. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి తొలి ప్రాధాన్య ఓట్లు 48,874 వస్తే, ద్వితీయ ప్రాధాన్య లెక్కింపులో వాటిలో 15,086 మంది ఎవ్వరికీ రెండో ప్రాధాన్యం ఇవ్వలేదు. మిగిలిన వాటిలో బీఆర్ఎస్‌కు 19,510 ఓట్లు, కాంగ్రెస్‌కు 14,278 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందువరకు బీజేపీలో కొనసాగి ఉండడం, కాంగ్రెస్‌ను పూర్తిగా వ్యతిరేకించే బీజేపీ అనుకూల గ్రాడ్యుయేట్లు బీఆర్ఎస్ వైపు మొగ్గినట్లు చెబుతున్నారు. అయితే బీజేపీ అభ్యర్థి ఎలిమినేట్ అయితే అందులో 80శాతం వరకు తమ అభ్యర్థికే ద్వితీయ ప్రాధాన్య ఓట్లు దక్కుతాయని భావించిన బీఆర్ఎస్ ఆశలు ఫలించలేదు. ద్వితీయ ప్రాధాన్యంలో ఎవ్వరికీ ఓటేయని 15,086 మంది ఓటర్లు ఒకవేళ రెండో ప్రాధాన్యాన్ని కేటాయించి ఉంటే ఫలితం తారుమారయ్యేదని విశ్లేషకులు చెబుతున్నారు.

గణనీయ ఓట్లు సాధించిన అశోక్‌కుమార్

ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన నల్లగొండకు చెందిన పాలకూరి అశోక్‌కుమార్ గణనీయ ఓట్లు సాధించి మూడు ఉమ్మడి జిల్లాల్లో చర్చనీయాంశంగా మారారు. ఆయన గతంలో పలు పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేయగా, ఆ తర్వాత ఆన్‌లైన్‌లో పోటీపరీక్షలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తక్కువ ధరతో ఆన్‌లైన్ క్లాసుల సబ్‌స్క్రిప్షన్‌ను ఇస్తుండడం ద్వారా నిరుద్యోగులకు, విద్యార్థులకు ఆయన చేరవయ్యారు. ఆయన అభ్యర్థిగా బరిలో నిలవడంతో ఆయా వర్గాల నుంచి గణనీయమైన ఆదరణ లభించినట్లుగా భావిస్తున్నారు. ఆయనకు తొలిప్రాధాన్యంలో 29,697 ఓట్లు రాగా, ఎలిమినేషన్ రౌండ్లలో మరో 764 ఓట్లు కలిపి మొత్తంగా 30,461 ఓట్లు వచ్చాయి.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష

● నిమిషం ఆలస్యం నిబంధనతో వెనుదిరిగిన పలువురు అభ్యర్థులు



ఎంజీయూలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ క్రైం, జూన్ 9: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షకు ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. వివిధ కారణాలతో పరీక్ష సమయానికంటే ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అధికారులు అనుమతించలేదు. దీంతో పలువురు అభ్యర్థులు పరీక్ష రాయకుండానే వెనుదిరిగారు. గ్రూప్-1 పరీక్ష కోసం అధికారులు జిల్లాలో 47 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 16,899 మంది అభ్యర్థులకు 13,616 మంది (80.57శాతం) హాజరయ్యారు. 3,283 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అన్నెపర్తిలోని ఎంజీయూలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనాదీప్తి పర్యవేక్షించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని రామగిరిలోని మహిళా డిగ్రీ కళాశాలను కలెక్టర్ తనిఖీ చేసి అభ్యర్థుల హాజరు, గైర్హాజరు, వసతుల కల్పనను చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. దేవరకొండ రోడ్డులోని సాందీప్ పాఠశాల, సెయింట్ అల్ఫోన్సస్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి పరీక్ష కేంద్రానికి నలుగురు అభ్యర్థులు, నీలగిరి కళాశాలకు ఇద్దరు, ఎన్‌జీ కళాశాలకు ఇద్దరు, కాకతీయ కళాశాలలోని పరీక్షా కేంద్రానికి ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని అనుమతించలేదు. ట్రాఫిక్ సమస్యతో పాటు బస్సు ఆలస్యం కావడం, రోడ్డు మరమ్మతులు, తదితర కారణాలతో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు, పరీక్షకు అనుమతించకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.





ఎన్జీ కళాశాల వద్ద రద్దీ, ఆలస్యం కావడంతో పరుగులు తీస్తున్న అభ్యర్థులు

నేడు పండింట్‌లు, పీఈటీల
సర్టిఫికెట్ల వెరిఫికేషన్



నల్లగొండ, జూన్ 9: పండింట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్లు, పదోన్నతుల్లో భాగంగా సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ డీఈవో కార్యాలయంలో నిర్వహించనున్నట్టు డీఈవో భిక్షపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ బుక్, రెండు సెట్ల జీరాక్స్ ప్రతులతో సోమవారం ఉదయం 9గంటలకు డీఈవో కార్యాలయానికి రావాలని ఎంఈవోల ద్వారా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సమాచారం అందించినట్టు తెలిపారు.

మలిదశ ఉద్యమకారులను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొల్లారి కిరణ్

నల్లగొండ టౌన్, జూన్ 9: తెలంగాణ మలిదశ ఉద్యమకారులను గుర్తించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్గారి కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బొల్గారి కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుకోసం పోరాడిన ఉద్యమకారుల ఆకాంక్షల సాధన కోసం మలిదశ ఉద్యమకారుల సంఘం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తెలంగాణ ఉద్యమకారులను గుర్తిస్తూ ప్రతీ తెలంగాణ ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులందరినీ గుర్తించి గుర్తింపుకార్డులు ఇవ్వాలని, అమరవీరుల కుటుంబాలకు ప్రకటించిన విధంగా ప్రతీ నెలా రూ.25వేల గౌరవ వేతనం ఇవ్వాలని, అమరుల కుటుంబాలతోపాటు మలిదశ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి కూడా గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా బొల్గారి కిరణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఖాసీం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అల్లే పరమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పర్వతం వేణు, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీను, కోశాధికారిగా రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్, జూన్ 9: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన హ్యాండ్ బాల్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. క్రీడా మైదానాలను అభివృద్ధి చేయడంతోపాటు ఆటలపై ఆసక్తి కనబరిచే విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకుడు చినవెంకన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో విత్తన ఎంపికే
ప్రధానం



- మేలు రకంతో అధిక దిగుబడులు
- నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం

నిడమనూరు, బీబీనగర్, జూన్ 9: వానాకాలం సీజన్ ప్రారంభమైంది. తొలకరి పలకరించడంతో పాటు నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సాగుకు రైతులు ఉపక్రమిస్తున్నారు. పంటల సాగులో మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవడం ఎంతో ప్రధానం. కానీ తరచూ నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. పలు ప్రైవేట్ విత్తన కంపెనీలు ఆకర్షణీయ ప్యాకింగ్‌తో, నకిలీ లేబుళ్లతో రైతులను మోసం చేస్తున్నాయి. ఇటువంటి విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకొని నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి దిగుబడులు సాధించాలి.

విత్తన సంచులపై వివరాలు

విత్తన సంచులపై ఉన్న వివరాలను పూర్తిగా చదివిన తరువాతే వాటిని కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. సంచులపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధ్రువీకరణ సంస్థ పేరు, చిరునామా ఉండాలి. అలాగే విత్తన రకం, దాని జన్యు స్వచ్ఛతకు సంబంధించిన సమాచారం, లాట్ క్రమ సంఖ్య తదితర విషయాలు సమగ్రంగా ఉండాలి. విత్తన ఉత్పత్తిదారుడి పేరు, చిరునామాతో పాటు విత్తనాలను ఎప్పటివరకు వినియోగించుకోవచ్చో తెలిపే సమాచారం ఉండాలి. ట్యాగ్ ఇచ్చిన తేదీ వివరాలు సరిగా ఉన్నాయా లేదా అనే పరిశీలించి రైతులు కొనుగోలు చేయాలి.

విత్తనోత్పత్తి

మేలు రకం విత్తనాలను రైతులు కూడా ఉత్పత్తి చేసుకోవచ్చు. మంచి విత్తనం అంటే శుభ్రత, నాణ్యతతో పాటు బాగా మొలకెత్తే స్వభావం ఉండాలి. ప్రతీ రైతు తనకు తానే నాణ్యమైన విత్తనాలను తయారు చేసుకుంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందవచ్చు. పరిశోధనా సంస్థల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో రూపొందించే బ్రీడర్ విత్తనం నుంచి ఫౌండేషన్ విత్తనాన్ని ఉత్పత్తి చేస్తారు. ఈ ఫౌండేషన్ విత్తనాల నుంచి సర్టిఫైడ్ విత్తనాలు ఉత్పత్తి అవుతాయి. రైతులు ఈ విత్తనాలనే వాడాల్సి ఉంటుంది. సర్టిఫైడ్ సీడ్స్ జన్యుపరంగా మంచి లక్షణాలు ఉంటాయి. మొలక శాతం ఎక్కువగా ఉంటుంది. రోగ కారకమైన శిలీంద్రాల బెడద ఉండదు. అలాంటి విత్తనాలతో పండించిన పంటల నుంచి విత్తనోత్పత్తి చేసుకొని పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

టీజీ సీడ్స్ ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ

వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన మేలురకం వరి, అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందించేందుకు టీజీ సీడ్స్ సంస్థ ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి జిల్లాలోని 104 పంపిణీ కేంద్రాల్లో విత్తనాలను రైతులకు విక్రయించనుంది. ఆయా కేంద్రాల్లో 2147.25 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను అందుబాటులో ఉంచింది. జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలకు 60శాతం సబ్సిడీ ఉంది.

కల్తీ కనిపెట్టకుంటే అంతే

ధర తక్కువగా ఉండే పురుగు మందులు, రసాయన ఎరువులను ఎక్కువ ధర ఉండే కంపెనీల పేరుతో వ్యాపారులు విక్రయిస్తుంటారు. చలామణిలో ఉన్న ఎరువులు, పురుగు మందులను పోలి ఉండేలా నకిలీలను విక్రయిస్తు ఉంటారు. తేమ ఉన్న గడ్డ కట్టిన వాటిలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తాయి. గుళికలన్నీ ఒకే రంగులో ఉంటాయి. అన్య పదార్థం ఎరువులో కనిపిస్తే దాన్ని కల్తీగా గుర్తించాలి. యూరియా, కాలుష్యం, అమ్మోనియం, నైట్రేట్, ఇతర సంకీర్ణ ఎరువులు సాధారణంగా గుళికల రూపంలో ఉంటాయి. 15-15-15, 20-20-20 రేణువుల రూపంలో, మ్యూరేట్ ఆఫ్ పొటాషియం, సల్ఫేడ్, ఎరువులు పొడి రూపంలో ఉంటాయి. అలా లేకపోతే వాటిని కల్తీగా గుర్తించాలి. యూరియా, అమ్మోనియం, సల్ఫేడ్, జింకు సల్ఫేడ్ స్వచ్ఛమేనవేనా? లేదా? తెలుసుకోవాలంటే ఎరువును ఒక చెంచా తీసుకుని 5మిల్లీలీటర్ల శుద్ధమైన నీటి (డిస్టిల్డ్ వాటర్)లో కలిపితే స్వచ్ఛందంగా ఉండాలి. యూరెట్ ఆఫ్ పొటాష్, అమ్మోనియం క్లోరైడ్ అయితే టీస్పూన్ ఎరువును 10మిల్లీలీటర్ల నీటిలో వేసి బాగా కలిపితే ఆ నీరు స్వచ్ఛందంగా ఉండాలి.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



పంటల సాగు కోసం విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆథరైజ్డ్ డీలర్ల వద్దే కొనుగోలు చేసి తప్పనిసరిగా రశీదులు పొందాలి. నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే సమాచారం అందించాలి. పంటల సాగుపై రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

మునికృష్ణయ్య, నిడమనూరు ఏవో

అప్రమత్తత అవసరం

అధికారులు సూచించిన పురుగుల మందులనే వాడాలి. లేబుల్ లేని మందు సీసాలు, డబ్బాలు, ప్యాకెట్లను కొనుగోలు చేయరాదు. మందు పేరు, రూపం, శాతం, పరిమాణం జాగ్రత్తలు, విరుగుడు, తయారు చేసిన సంస్థ, గడువు తేదీ, రిజిస్ట్రేషన్ వివరాలను కొనుగోలు చేసే ముందు పరిశీలించాలి. కొనుగోలు చేసిన డీలర్ నుంచి సంతకం తీసుకోవాలి. మందు సీసాలు, డబ్బాలపై సీల్ సక్రమంగా లేకుంటే కొనుగోలు చేయకూడదు. లైసెన్సు లేని డీలర్లు సస్యరక్షణ మందులను విక్రయిస్తే వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. కొనుగోలు చేసిన ఎరువులకు తగిన బిల్లు తీసుకోవాలి. దానిని జాగ్రత్తగా భద్రపరచాలి. డీలర్ పుస్తకంలో విధిగా రైతులు సంతకం చేయాలి. మిషన్ కుట్టు ఉన్న సంచులనే కొనుగోలు చేయాలి. చేతి కుట్టు ఉంటే దానిపై సీసం సీల్ ఉందో లేదో గమనించాలి. బస్తాపై ఉత్పత్తిదారు వివరాలు ఉన్నది లేనిది గమనించాలి. కొత్త రకం విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఆ విత్తనాలను ఇంతకుముందు తోటి రైతులు ఎవరైనా కొనుగోలు చేసి ఉపయోగించారా, చీడపీడల్ని తట్టుకునే సామర్థ్యం ఎంతవరకు ఉందనే విషయాలు తెలుసుకోవడం మంచిది. గతంలో దిగుబడులు ఎలా వచ్చాయని కూడా తెలుసుకోవాలి.



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మిర్యాలగూడ టౌన్, జూన్ 8: పట్టణ క్రీడాకారులు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ తెలిపారు. క్లియో స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన అండర్-19 సెలక్షన్స్‌లో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన క్రీడాకారులు ప్రణీత్, హేమంత్, జగత్, కార్తికేయ, జయశ్రీ, రాధశ్రీ, పూజిత, వివేక్, అక్షిత్‌రెడ్డి, అన్విత్‌రెడ్డి, తేజస్విని, చందన, హారిక, వెంకటసాయి, వైష్ణవి, బర్షైశ్, శశాంక్‌రెడ్డి, నిశాంత్, ఉత్తేజ్‌కుమార్, గౌతమ్, నయనికారెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ తోట రంగారావు, డాక్టర్ ప్రశాంత్, నవీన్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు అంత్యక్రియల్లో జిల్లా నేతలు



హైదరాబాద్‌లోని రామోజీఫిలిం సిటీలో ఆదివారం జరిగిన రామోజీ రావు అంత్యక్రియలకు హాజరైన రాజ్యసభమాజీ సభ్యుడు బడుగుల లింగయ్య, మాజీ ఎమ్మెల్యేలు మోత్కుపల్లి నర్సింహులు, నల్లమోతు భాస్కర్‌రావు

యాదగిరి క్షేత్రంలో భక్తుల కోలాహలం

భువనగిరి అర్బన్, జూన్ 9 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీన రసింహస్వామి వారి దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఈ నెల 11 నుంచి వేసవి సెలవులు ముగుస్తుండటం, అందులోనూ ఆదివారం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. సుమారు 60వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక దర్శనాలకు గంట, ధర్మదర్శనానికి మూడుగంటల సమయం పట్టింది. ఉభయ క్యూలైన్లల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తజనులు కనిపించారు. కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధుల్లో సందడి నెలకొంది. ప్రధానాలయం, ప్రసాద విక్రయశాల, మెట్లదారిలో భక్తులతో కిటకిటలాడారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.83,19,056ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్యపూజలు

సుప్రభాత సేవతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకారమండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామిఅమ్మవార్లకు నిత్యపూజలు ఘనంగా చేపట్టారు.

నెత్తురోడిన రహదారులు

- వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో ప్రమాదాలు
- ఏడుగురి మృతి, మరో ఏడుగురికి తీవ్ర గాయాలు

పెబ్బేరు/ సదాశివపేట/ కృష్ణకాలనీ, జూన్ 9: రాష్ట్రంలో ఆదివారం రహదారులు నెత్తురోడాయి. వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుజరాత్‌కు చెందిన జైన సాధువులు విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, ప్రియాంకర్ రాజ్, భగవాన్‌భాయ్, హేమల్ ప్రవీణ్‌షా, పునీత్ మహరాజ్ మత ప్రచారం నిమిత్తం కాలినడకన బయలుదేరి శనివారం రాత్రి వనపర్తి జిల్లా రంగాపురం గ్రామంలో బసచేశారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున బయలుదేరిన వారిని రంగాపురం శివారులో హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ప్రమాదంలో భగవాన్‌భాయ్(36), హేమల్ ప్రవీణ్‌షా (32) అక్కడికక్కడే మృతి చెందగా, విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహారాజ్, ప్రియాంకర్ రాజ్ తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పునీత్ మహరాజ్(50) మృతి చెందారు. మిగిలిన ఇద్దరినీ మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంగారెడ్డి జిల్లాలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉన్నాల్ గ్రామానికి చెందిన దంపతులు హజీ షాబాజ్ కుటుంబంతో కారులో ఆదివారం హైదరాబాద్ నుంచి బీజాపూర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ సమీపంలో మహారాష్ట్రకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ అతివేగంగా వారి కారును ఢీకొట్టింది. అదే సమయంలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ కూడా బలంగా కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల మధ్యన కారు ఇరుక్కుని నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో షాబాజ్ భార్య సమ్రీన్ బేగం(35), మహారాష్ట్రలోని ముంబైకి చెందిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృత్యుంజయ్ దూబే(45) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన హజీ షాబాజ్, అతడి కుమారులు జునైద్, అబ్దుల్లాతో పాటు, మరో లారీ డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. ఘటనలో భూపాలపల్లి జిల్లాలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌కు చెందిన రేగళ్ల నరేశ్(38), రేగళ్ల ప్రమోద్ (24), రేగళ్ల సిద్దు పని నిమిత్తం ఒకే బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో మేడారం నుంచి భూపాలపల్లికి వెళ్తున్న కారు అదుపుతప్పి కమలాపూర్ వద్ద వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ప్రమోద్ మృతి చెందగా.. సిద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



సంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

విజయవాడ-హైదరాబాద్ హైవేపై దోపిడీ

- కారులో నిద్రిస్తున్న వారిపై దుండగుల దాడి
- ఆపై రూ.3 లక్షల విలువైన ఆభరణాల చోరీ
- నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఘటన

చిట్యాల రూరల్, జూన్ 9: నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున దారిదోపిడీ జరిగింది. సుదీర్ఘ ప్రయాణంతో అలసిపోయిన దంపతులు హైవే పక్కన బస్‌బే మార్గంలో కారులో విశ్రాంతి తీసుకుంటుండగా దొంగలు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన పంచాక్షరి-అఖిల దంపతులు. వీరికి ఏడాదిన్నర కుమారుడు దేవాంశ్ ఉన్నాడు. పంచాక్షరికి సోదరి శ్రుతి ఉంది. పంచాక్షరి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ సంస్థలో, శ్రుతి మరో సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం తోట్లపాలెం నుంచి పంచాక్షరి-అఖిల దంపతులు, వారి కుమారుడు దేవాంశ్, శ్రుతి కలిసి కారులో శనివారం హైదరాబాద్‌కు బయలుదేరారు. విజయవాడ-హైదరాబాద్ హైవేలోని నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తికి వచ్చేసరికి కారు నడుపుతున్న పంచాక్షరి అలసిపోయాడు. నిద్ర వస్తుండటంతో ఆదివారం వేకువజామున 2.30 గంటలకు కారును సర్వీస్ రోడ్డులోని బస్‌బేలో ఓ ట్రాలీ వెనుక వాహనాన్ని నిలిపాడు. కార్ డోర్‌లాక్ వేసి లోపల నిద్రించారు. సుమారు 3.45 గంటల ప్రాంతంలో ఇద్దరు దొంగలు ముఖం కనబడకుండా వస్త్రాలు కట్టుకుని పెద్దబండరాయితో కారు ముందుభాగంలోని కుడి, ఎడమవైపు అద్దాలను ధ్వంసం చేశారు. ముందుసీట్లలో నిద్రిస్తున్న పంచాక్షరిని, శ్రుతిని కారులోంచి బయటకు లాగి రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. పంచాక్షరి వేలికి ఉన్న 10 గ్రాముల బంగారు ఉంగరం, శ్రుతి మెడలోని 10 గ్రాముల బంగారు గొలుసు, అఖిల మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని సమీపంలోని తోటలోకి పారిపోయారు. దుండగుల దాడిలో గాయపడిన పంచాక్షరి, శ్రుతిలను గమనించిన ఓ వ్యాన్ డ్రైవర్ తన వాహనాన్ని ఆపి.. వారిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాగా, దోపిడీ జరిగిన ప్రాంతాన్ని నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి ఆదివారం పరిశీలించారు.

అమరావతిలో మొదలైన పనులు

200 పొక్లెయిన్లతో జంగిల్ క్లియరెన్స్.. పిచ్చి మొక్కలు తొలగింపు

- రహదారుల బాగు పనులు షురూ
- ఆగిపోయిన నిర్మాణాలు ప్రారంభం
- రాజధానిలో సీఎస్ సుడిగాలి పర్యటన

తుళ్లూరు, జూన్ 9: గత ఐదేళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మళ్లీ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అమరావతిలో నిలిచిపోయిన వివిధ భవన నిర్మాణ పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. రాజధాని ప్రాంతంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా రాజధాని ప్రాంతానికి గతంలో భూమి పూజ జరిగిన ఉద్దండరాయునిపాలెంలోని సీఆర్‌డీఏ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. రాయపూడి రెవెన్యూలో నిర్మాణం పూర్తికావచ్చిన సీఆర్డీఏ రీజినల్ కార్యాలయాన్ని, అఖిల భారత సర్వీసు అధికారుల నివాసం సముదాయ భవనాలను, ఎమ్మెల్యేల క్వార్టర్లు, ఏపీ ఎన్జీవో నివాస భవనాల సముదాయాలను.. హైకోర్టు తదితర ప్రాంతాలను సీఎస్ పరిశీలించారు. శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఫౌండేషన్ వరకు వచ్చి ఆగిపోయిన ప్రాంతాల్లో పర్యటించారు. రాజధాని ప్రాంతం చిట్టడవిలా మారి ఉండడంతో తొలుత పెద్దఎత్తున జంగిల్ క్లియరెన్స్ పనులకు ఆదేశించారు. 200 పొక్లెయిన్లు చిట్టడవిగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యాయి. పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. రోడ్లు బాగు చేయడంతోపాటు గతంలో జరిగిన నిర్మాణాల వద్ద మళ్లీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా, జంగిల్ క్లియరెన్స్ పనులు వెంటనే పూర్తిచేయాలని సీఎస్ నీరబ్ కుమార్ సూచించారు. రాజధానిలో అన్నిచోట్లా వీధి లైట్లు వెలగాలని సీఆర్డీయే అధికారులను ఆదేశించారు. ఈ నెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో సీఎస్ అమరావతి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎస్‌తో పాటు సీఆర్డీఏ కమిషనర్ వివేక్, అదనపు కమిషనర్, సీఆర్డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎస్ విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన పనులు చేయడానికి 25 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. రాజధాని రైతుల వార్షిక కౌలును త్వరలోనే అందజేస్తామని చెప్పారు. రాజధానిలో చంద్రబాబు అప్పగించిన పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తామని ప్రకటించారు. రేయింబవళ్లు జేసీబీ యంత్రాలు జంగిల్ క్లియరెన్స్ పనులలో నిమగ్నమయ్యాయని, ఇప్పటికే 80 యంత్రాలు పనులు చేస్తున్నాయని తెలిపారు. నిర్మాణంలో వినియోగించి తుప్పుపట్టిన ఇనుము విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ పేర్కొన్నారు.



రాజధాని అమరావతిలో పర్యటించిన ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

చకచకా పనులు

- చంద్రబాబు ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్, డీజీపీ

గన్నవరం, జూన్ 9: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో నిర్వహించే ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం 17 ఎకరాల విస్తీర్ణంలో సీనియర్ అధికారులు, టీడీపీ నేతల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు ఆదివారం పరిశీలించారు. 60 మంది కూర్చునే విధంగా 80 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడువు, 8 అడుగల ఎత్తులో స్టేజీని నిర్మిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, ప్రజల కోసం 800 అడుగుల పొడవు, 420 అడుగుల వెడల్పు ఉన్న జర్మన్ హ్యాంగర్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని మోదీతోపాటు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు వస్తుండటంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి!

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని ఆందోళన
- రూ.8 లక్షల పరిహారంతో రాజీ!

గద్వాల క్రైం, జూన్ 9: కాన్పు కోసం వచ్చిన ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో ఆస్పత్రిలో చనిపోయింది. అయితే, డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఆమె చనిపోయిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన శివలీల(19)కు గత ఏడాది అదే మండలంలోని కుర్వపల్లికి చెందిన రాజుతో వివాహమైంది. నిండు చూలాలు అయిన శివలీలను ఈనెల 5న కాన్పు కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గర్భంలోని బిడ్డ హృదయస్పందన సక్రమంగా లేదని, వెంటనే సిజేరియన్ చేయాలని వైద్యులు సూచించారు. మరుసటి రోజు సిజేరియన్ చేయగా శివలీలకు మగ శిశువు జన్మించాడు. అయితే ప్రసవం అయిన వెంటనే బాలింత కోమాలోకి వెళ్లింది. దాంతో ఆమెను ఆస్పత్రి సిబ్బంది కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం అర్ధరాత్రి బాలింత మృతి చెందిందని కర్నూల్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. అయితే శివలీల అంతకుముందే చనిపోయిందని, అయినా వైద్యులు దాచిపెట్టారని ఆమె బంధువులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యమే శివలీల చనిపోయిందని గద్వాలలోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అయితే కుర్వపల్లికి చెందిన ఓ నాయకుడు బాధిత కుటుంబానికి రూ.8లక్షల పరిహారం ఇచ్చేలా మాట్లాడి పంచాయితీ తెంచినట్లు తెలిసింది.

జూరాలకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అమరచింత, జూన్ 9: జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల పరిధిలోని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆదివారం జూరాల ప్రాజెక్టుకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. జూరాల ప్రాజెక్టులో గత వారం 3.744 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం నీటి నిల్వ 4.618 టీఎంసీలకు చేరింది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో రెండు రోజులుగా జూరాలకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉంటోంది. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి సత్యసాయి పంప్ హౌస్‌ల ద్వారా సాగునీటి సరఫరా, ఇతర అవసరాలకు 149 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

సారీ తమ్ముడు చచ్చిపోతున్నా..

- భార్య వివాహేతర సంబంధం
- మనోవేదనతో భర్త ఆత్మహత్య
- చనిపోయే ముందు సెల్ఫీ వీడియో

హుజూర్‌నగర్, జూన్ 9: "అరె తమ్ముడు, నా పిల్లలను మంచిగా చూసుకోరా. చెల్లి స్వప్న.. నేను చచ్చిపోతున్నా! మన కుటుంబాల్లో ఇలాంటి వాళ్లు ఉండొద్దు. ఎంతకైనా పోరాడు, వదలొద్దు".. అంటూ భార్య వ్యవహారంతో విసుగుచెందిన ఓ భర్త ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో వెళ్లగక్కిన ఆవేదన ఇది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం, వద్దని వారించినా వినకపోవడంతో విసుగెత్తిన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. హుజూర్‌నగర్‌కు చెందిన చిట్టిప్రోలు రంజిత్(35) వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్. మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మహిళను 14 ఏళ్ల కిందట ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికంగా సీతారాంనగర్ కాలనీలో రంజిత్ కుటుంబం అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. తన భార్య ఒక హోటల్ యజమాని కుమారుడితో వివాహేతర సంబంధం నెరుపుతున్నట్లు రంజిత్‌కు తెలిసింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరిగేది. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం రంజిత్ భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రంజిత్ తన పిల్లలను తీస్కోని మఠంపల్లిలోని చెల్లెలి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం హుజూర్‌నగర్‌కు తిరిగొచ్చిన రంజిత్ ఇంట్లో ఉరివేసుకున్నాడు. అంతకు ముందే సెల్ఫీ వీడియోలో తన చావబోతున్నానని, అందుకు భార్య తీరు కారణమని, తన పిల్లలను బాగా చూసుకోవాలని తమ్ముడు, చెల్లెళ్ని వేడుకున్నాడు. శనివారం సాయంత్రం రంజిత్ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కింటి వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. రంజిత్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. కాగా రంజిత్ పెట్టుకున్న సెల్ఫీ వీడియో వాట్సాప్ స్టేటస్‌ను అతని మిత్రుడు ఆలస్యంగా గమనించడంతో ఈ వీడియో వ్యవహారం బయటకు వచ్చింది. కాగా, రంజిత్ మృతికి కారణమైన భార్య, హోటల్ యజమాని కుమారుడిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు సమాచారం. హోటల్ యజమాని కుమారుడు, రంజిత్ భార్యను కేసు నుంచి తప్పించేందుకు కొంతమంది కీలక నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.



రంజిత్(ఫైల్)

టెస్కాబ్‌లో అవిశ్వాసంపై నేటి సమావేశం రద్దు!

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్)లో సోమవారం నిర్వహించాల్సిన అవిశ్వాస తీర్మానంపై సమావేశం రద్దు అయ్యింది. ఇప్పటి వరకు టెస్కాబ్ ఛైర్మన్‌గా కొనసాగిన కొండూరు రవీందర్‌రావు, వైస్ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిలపై పాలకవర్గ సభ్యులు ఇటీవల అవిశ్వాస తీర్మానం పెడుతూ నోటీసు ఇచ్చిన విషయం విదితమే. అయితే అవిశ్వాసాన్ని ఎదుర్కోవటం ఇష్టం లేని రవీందర్‌రావు, మహేందర్‌రెడ్డి ఇటీవల తమ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పదవులకు రాజీనామా చేశారు. దీంతో అవిశ్వాసంపై సమావేశంతో అవసరం లేకుండాపోయింది. అయితే పాలకవర్గాన్ని ఎన్నుకోవటానికి నేడో, రేపో సమావేశం కానున్నారు. మెదక్ జిల్లా డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిని టెస్కాబ్ ఛైర్మన్‌గా చేయటానికి ముఖ్యమంత్రి, మంత్రివర్గం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాతే ఎన్నిక నిర్వహించనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో టెస్కాబ్ పాలకవర్గ ఎన్నికలు లాంఛనంగా జరగనున్నాయి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పొలంలో కరెంటు షాక్‌తో అన్నదాత మృతి

పాపన్నపేట/నార్కట్‌పల్లి, జూన్ 9: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లిలో టప్ప మల్లేశం(38) అనే రైతు కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. వడగళ్ల వానతో పంట దెబ్బతినడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. రుణభారం పెరిగిపోవడంతో గత నెల 30న కౌలు తీసుకున్న పొలం వద్ద పురుగు మందు తాగాడు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇక, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బెండల్‌పహాడ్‌కు చెందిన యానాల కృష్ణారెడ్డి (58) అనే రైతు విద్యుదాఘాతంతో పొలంలోనే ప్రాణాలు వదిలాడు. కౌలుకు తీసుకున్న పొలంలో ఉన్న బోరు మోటారుకు మరమ్మతులు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

సైబర్ బాధితులకు రూ.7.9 కోట్లు రికవరీ చేశాం

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్ము రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎస్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా అన్ని జిల్లాలు, పోలీస్ కమిషనరేట్ల అధికారుల సమన్వయంతో ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైందని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. టీజీసీఎస్‌బీలో 4,144 కేసులు నమోదు కాగా, జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసుల్లో బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్మును తిరిగి ఇప్పించగలిగామని వివరించారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ 803 కేసులను పరిష్కరించి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన రూ.3,66,83,748ను బాధితులకు ఇప్పించినట్లు వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

'హాక్ ఐ' హ్యాకర్ అరెస్టు

- ఢిల్లీలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసు శాఖకు చెందిన హాక్ ఐ, టీఎస్ కాప్, ఎస్ఎంఎస్ పోర్టల్ యాప్‌లను హ్యాక్ చేసి డేటా చోరీ చేసిన హ్యాకర్‌ను అరెస్టు చేసినట్లు డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఈ నెల 8న ఢిల్లీలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హ్యాకర్ చోరీ వివరాలను databreachforum.st లో పోస్ట్ చేసి, ఆ డేటాను 150 డాలర్ల (రూ.12,529)కు అమ్మకానికి పెట్టాడని తెలిపారు. ఆసక్తి గలవారు సంప్రదించడానికి టెలిగ్రామ్ ఐడీలు కూడా అందులో ఉంచినట్లు డీజీపీ వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అధునాతన సాంకేతికతతో ఢిల్లీలో 20ఏళ్ల జతిన్ కుమార్(యూపీకి చెందిన)ను నిందితుడిగా గుర్తించారన్నారు. అతడిని ట్రాన్సిట్ రిమాండ్‌పై హైదరాబాద్‌కు తీసుకురానున్నట్లు వివరించారు. కాగా, హాక్‌ఐ యాప్ డేటాలో మొబైల్ నంబర్, చిరునామా, ఈమెయిల్ ఐడీ వంటి సమాచారమే ఉంటుందని.. డీజీపీ తెలిపారు. వినియోగదారుల వ్యక్తిగత సమాచారం లీక్ కాలేదన్నారు.

వానాకాలం మొదలైనా పెట్టుబడి సాయమేదీ?

- రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు
- విత్తనాల కొరత రాకుండా చూడటంలో విఫలం: హరీశ్‌రావు

నంగునూరు, జూన్ 9: వానాకాలం మొదలైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. విత్తనాలకు కొరత లేకుండా చూడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో రైతు నాగేంద్రం సాగుచేసిన ఆయిల్ పామ్ మొదటి పంట కోత పనులు ఆదివారం చేపట్టగా.. హరీశ్‌రావు ఆ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి మాట్లాడారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. పంట బోనస్ హామీ బోగస్‌లా మారిందని విమర్శించారు. కేవలం సన్న వడ్లకే బోనస్ అనడం మాట తప్పడమేనన్నారు. రాష్ట్రంలో 90శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. అలాగే, పామాయిల్ దిగుమతిపై తొలగించిన సుంకాన్ని మళ్లీ విధించాలని హరీశ్‌రావు ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ రైతులను ప్రోత్సహించాలన్నారు.



ఆయిల్ పామ్ గెలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూన్ 9: ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి, పెండ్లిపాకల, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. రెండున్నరేళ్లలో డిండి ఎత్తిపోతల, శ్రీశైలం సొరంగమార్గం పనులను పూర్తి చేస్తామని అన్నారు. ఈ మేరకు ప్రస్తుతం రూ.2వేల కోట్లు ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. డిండి ఎత్తిపోతల, నక్కలగండి ప్రాజెక్టులతో పాటు గుట్టలపై ఉన్న ప్రాంతాలకు ఐదు లిఫ్టుల ద్వారా సాగునీరు అందించేందుకు ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రామోజీరావు జీవితం భవిష్యత్తు తరాలకు ఆదర్శం

● ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



హాలియాలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, పలువురు నాయకులు

హాలియా, జూన్, 9: చెరుకూరి రామోజీరావు జీవితం భవిష్యత్తు తరాలకు ఆదర్శమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా మునిసిపాలిటీలోని బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం రామోజీరావు చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటని అన్నారు. జీవితకాలంలో వారందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలుగు ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించారని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, వివిధ పార్టీల నాయకులు, వడ్డే సతీష్‌రెడ్డి, వర్ర వెంకట్‌రెడ్డి, సురభి రాంబాబు, ఆకారపు నరేష్, మంద తిరుపతయ్య, సైదులురావు గౌతమ్, రాంబాబు, పాత్రికేయులు వెంకట్‌రెడ్డి, దామోదర్, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, విద్యాసాగర్, రాఘవాచార్యులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కొండమల్లేపల్లి, జూన్ 9: రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా టీయూడబ్ల్యూజే, ఐజేయూ నిరంతరం పోరాటాలు చేస్తుందని నల్లగొండ జిల్లా వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అన్నారు. కొండమల్లేపల్లి మార్కెట్ యార్డులో ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం కాలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక జర్నలిస్టుల సమస్యలన్ని పరిష్కారం అవుతాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. సంఘం దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు గాదె గిరిధర్‌రావు మాట్లాడుతూ జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. జర్నలిస్టులందరికీ ఇళ్లపట్టాలు, అక్రిడిటేషన్ కార్డులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. సమావేశంలో టీయూడబ్ల్యూజే, ఐజేయూ జిల్లా నాయకుడు శ్రీనివాస్, జర్నలిస్టుల యూనియన్ సీనియర్ నాయకులు ఎం.శ్రీనివాస్‌రెడ్డి, యూనియన్ డివిజన్ కోశాధికారి బూడిద శ్రీనివాస్‌యాదవ్, పాష, అశోక్, ఏరుకొండ రాము, మైనుద్దీన్, ముత్యాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు యాదవ్

నల్లగొండ, జూన్ 9: సమాజ సేవతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని సమాచార హక్కు చట్టం రాష్ట్ర మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లుయాదవ్ కోరారు. జిల్లా కేంద్రంలోని యాదవ్ భవన్‌లో ఆదివారం జరిగిన ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అదేవిధంగా అధికారులు సమాచారాన్ని అందించాలన్నారు. జిల్లాలో యాదవ సమాజ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం పదవీ విరమణ పల్లెబోయిన కాశీరాములును సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ బెల్లి యాదయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్‌యాదవ్, నాయకులు పిల్లి రామరాజుయాదవ్, గంగుల చందువంశీ, నారాయణయాదవ్, లింగయ్య, శరత్‌బాబు, శ్యాంసుందర్, సత్యనారాయణ, ఎల్వీ యాదవ్, పద్మ, పర్వతాలు, లక్ష్మీనారాయణ, కోటయ్య, సుభాష్, నర్సింహ, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

శాలిగౌరారం, జూన్ 9: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన శాలిగౌరారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... శాలిగౌరారం మార్కెట్ కాలనీకి చెందిన బొడ్డు నాగరాజు రెండు గేదెలను గ్రామ శివారులో మేతకు వెళ్లాయి. ఇటీవల భారీ ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. తెగిపడిన తీగల వద్ద గేదెలు గడ్డి మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని బాధితుడు నాగరాజు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తన రెండు గేదెలు మృతి చెందాయని అధికారులు నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు

నల్లగొండటౌన్, జూన్ 9: ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకుడు ఎస్‌కె ముస్తఫా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం అమరులకు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఉద్యమకారులందరికీ 250గజాల ఇంటి స్థలం, ఉద్యమకారులను స్వతంత్ర సమరయోధులుగా గుర్తించాలన్నారు. అదేవిధంగా కేసులు లేని ఉద్యమకారులను కూడా పరిగణలోకి తీసుకొని వారికి కూడా అన్ని సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు 20 శాతం వాటా అమలు చేయాలని అన్నారు. జార్ఖండ్ ప్రభుత్వం మాదిరిగా ఉద్యమకారులను గుర్తించి నెలనెలా గౌరవవేతనం ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం మాదిగా సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులను విస్మరించకుండా ఉద్యమాన్ని ఎంతో శ్రమకోర్చి కష్టనష్టాలు భరించి, తెలంగాణ సాధనలో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని కోరారు. సమావేశంలో ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ వంటపాక యాదగిరి, కో కన్వీనర్ వల్కి వెంకటేశ్వర్లు, అద్దంకి రవీందర్, ఉద్యమకారులు శ్రీనివాస్, పందిరి సైదులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు బిజీబిజీ

● సాగు పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు



పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు, కూలీలు

చందంపేట, జూన్ 9: చందంపేట మండలంలోని చందంపేట, తెల్‌దేవరపల్లి, కంభాలపల్లి, చిత్రియాల, ముడుదండ్ల మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు పత్తి విత్తనాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలోనే జూన్ మొదటి వారంలో భారీ వర్షాలు కురియడంతో చెరువులు, కుంటలకు కొంతమేర నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితులు, నకిలీ విత్తనాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం ప్రారంభ సమయంలోనే వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాదైనా మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సాయిబాబా ఆలయాల్లో వార్షికోత్సవ పూజలు



కొండమల్లేపల్లిలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

దేవరకొండ/కొండమల్లేపల్లి, జూన్ 9: చింతపల్లి మండలంలో రెండో షిర్డీగా పేరుగాంచిన చింతపల్లి సాయిబాబా దేవాలయంలో వార్షిక ఉత్సవాలు ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు సాయినాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయకమిటీ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు చేపట్టారు. కొండమల్లేపల్లి సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనంజయ, నాయిని మాధవరెడ్డి, బుచ్చిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, రంగారెడ్డి, ఊరే నరేష్, పూజారులు సదాశివశర్మ, శివప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వెలమ సంఘం నేతగా శ్రీనివాస్‌రావు



శ్రీనివాస్‌రావు

దేవరకొండ, జూన్ 9: పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం దేవరకొండ డివిజన్ అధ్యక్షుడిగా మాధవరం శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని కొండభీమనపల్లి సమీపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వెలమ సంఘం ప్రధాన కార్యదర్శిగా నాగవరం మహేష్, ఉపాధ్యక్షులు జానకిరాంరావు, భగవంతరావు, నరేందర్‌రావు, కోశాధికారి ఎస్ఎస్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నర్సింహరావు, యాదగిరిరావు, రమణరావులు ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 8 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

'స్వాన్' ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

నార్కట్‌పల్లి, జూన్ 9: ఇటీవల పాముకాటుతో మృతి చెందిన నార్కట్‌పల్లి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థి చేపూరి రాజు కుటుంబానికి స్వాన్ ఆధ్వర్యంలో రూ.52వేలు పూర్వ విద్యార్థుల ద్వారా సేకరించి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో స్వాన్ సంస్థ వ్యవస్థాపకుడు మామిళ్ల సత్తిరెడ్డి, సభ్యులు మెరుగు శ్రవణ్, దామెర నవీన్, కన్నెబోయిన నర్సింహ, అంజిరెడ్డి, మామిడి సుధాకర్‌రెడ్డి, పులిజాల నర్సింగ్‌రావు, రవి పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ

దేవరకొండ, జూన్ 9: విద్యార్థులు, క్రీడాకారులు క్రీడల్లో రాణించేందుకు యువత స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు అన్నారు. దేవరకొండలో దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్, ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. స్పోర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులకు చేయూతనిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు భాస్కర్, బాలరాజు, సంజీవ, జయరాములు, జగదీశ్వర్, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

కాల్వ పునరుద్ధరణ పనులు ప్రారంభం

మాడ్గులపల్లి, జూన్ 9: మండలంలోని చెరువుపల్లి గ్రామ గార్ల చెరువు కాల్వ పునరుద్ధరణ పనులను మాజీ జడ్పీటీసీ, చంద్రం ఫౌండేషన్ చైర్మన్ తండు సైదులుగౌడ్ తన సొంత నిధులు రూ.13 లక్షలు వెచ్చించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా తన సొంత నిధులతో చెరువుపల్లి గార్ల చెరువు కాల్వ పనులను పునరుద్ధరణ చేస్తున్నట్లు తెలిపారు. చెరువు నిండటం వల్ల నాలుగు గ్రామాల రైతులకు సంబంధించిన సుమారు 20వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ సూదిరెడ్డి సుమలతశ్రీనివాస్‌రెడ్డి, చెరువుపల్లి మాజీ సర్పంచ్ బొర్రాజు సైదమ్మ సైదులుయాదవ్, కాంగ్రెస్ నాయకులు సైదిరెడ్డి, సాగర్, ప్రభాకర్‌రెడ్డి, రామస్వామి, కరుణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తేనెపల్లి తండాలో గడపగడపకు హనుమాన్ పూజ

గుర్రంపోడు, జూన్ 9: మండలంలోని తేనెపల్లి తండాలో హనుమాన్ దీక్ష పీఠాధిపతి జయరాం గురుస్వామి ఆధ్వర్యంలో ఈ ఆదివారం గడపగడపకు హనుమాన్ పూజ, భోగి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాం గురుస్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ వడ్త్యా రజితనాగరాజునాయక్, వడిత్య రవి, రంజానాయక్, నర్సింహనాయక్, ఆంగోతు వేము, జమ్లా, శివాజీ, ధర్మ, చందు పాల్గొన్నారు.

బొడ్రాయి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాలరూరల్, జూన్ 9: మండలంలోని పెద్దకాపర్తిలో జరుగుతున్న బొడ్రాయి ఉత్సవాల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. బొడ్రాయికి పూలమాలలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



త్రిపురారం మండల కేంద్రంలో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యార్థులు, ఉపాధ్యాయులు



శాలిగౌరారం మండలంల పెర్కకొండారంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యార్థులు



నకిరేకల్‌లోని ఏవీఎం పాఠశాలలో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

త్రిపురారం, చిట్యాలరూరల్, నకిరేకల్, శాలిగౌరారం, జూన్ 9: జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒక్క దగ్గరికి చేరుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు.

- త్రిపురారం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో 1998-99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు.
- చిట్యాల మండలంలోని వెలిమినేడులో జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 2005-06బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు.
- నకిరేకల్‌లోని ఏవీఎం పాఠశాలలో 2001-2002 బ్యాచ్‌కు చెందిన 130 మంది విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు.
- శాలిగౌరారం మండలం పెర్కకొండారం జడ్పీ హైస్కూల్‌లో 2003 - 04 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అప్పటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో

'ప్రగతి' కళాశాల విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



ఆర్. రాహుల్



హరిచక్రవర్తి



ఆకాష్

నల్లగొండ, జూన్ 9: ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ - 24 ఫలితాల్లో నలగొండ పట్టణంలో ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన విద్యార్థులు అఖిల భారతీయ వివిధ కేటగిరీల్లో ర్యాంకులు సాధించి జిల్లా చరిత్ర తిరగరాశారు. కళాశాలకు చెందిన ఆర్.రాహుల్ 207, ఎన్. హరిచక్రవర్తి 483, ఎ.ఆకాష్ 1390, జి. శివప్రసాద్ 5545 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ చంద కృష్ణమూర్తి, డైరెక్టర్లు నరేంద్రబాబు, శశిధర్‌రావు మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులకు అత్యుత్తమైన శిక్షణ ఇవ్వడం, సంపూర్ణమైన మెటీరియల్స్, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం కృషి ఫలితంగా ఉత్తమ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ఎన్ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



ఆర్. శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ టౌన్, జూన్ 9: ఐఐటీ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాల విద్యార్థి ఆర్. శ్రవణ్‌కుమార్ 1717 ర్యాంకు సాధించినట్లు కరస్పాండెంట్ బికుమళ్ల కిరణ్‌కుమార్ తెలిపారు. శ్రవణ్‌తో పాటు మరో ఐదుగురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిష్ఠాత్మక ఐఐటీలలో ప్రవేశానికి ఎంపిక కావడం హర్షనీయమన్నారు. క్రమశిక్షణ గల విద్యార్థులు, అంకితభావం గల అధ్యాపకులతో ఇంటర్, ఎప్‌సెట్, నీట్, జేఈఈ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించగలుగుతున్నామన్నారు. అనంతరం ర్యాంకర్లను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు హన్మంతరెడ్డి, నరేందర్‌రెడ్డి, పీఎల్ఎన్‌రెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో 211వ ర్యాంకు సాధించిన శివ



శివను అభినందిస్తున్న నారాయణ కళాశాల డీన్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది, (ఇన్‌సెట్‌లో) శివ

మిర్యాలగూడ టౌన్, జూన్ 9: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మిర్యాలగూడ పట్టణానికి చెందిన కుంచం శివ 211వ ర్యాంకు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన శివ పిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శివకు ఆదిత్య స్కూల్ కరస్పాండెంట్ అమరేందర్‌రెడ్డి పదో తరగతి వరకు ఉచిత విద్యనందించారు. పదో తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించిన శివకు నారాయణ కళాశాల, రావిరాల శాఖ ఇంటర్ విద్యను ఉచితంగా అందించి ప్రోత్సహించింది. ఇంటర్‌లో 940 మార్కులు సాధించిన శివ ఎప్‌సెట్‌లో 468 ర్యాంకు సాధించాడు. ఆదివారం వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా 211 ర్యాంకు సాధించి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి అత్యుత్తమ ర్యాంకు సాధించిన శివను నారాయణ కళాశాల కోర్ డీన్ కే.వెంకట్‌రెడ్డి, మిర్యాలగూడ ఏజీఎం దొంతిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఆదిత్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్, జ్యోతిష్‌రెడ్డి, రఘుపతి, వినయ్‌కుమార్, సంతోష్‌కుమార్ తదితరులు అభినందించారు. ఈ మేరకు శివ మాట్లాడుతూ అధ్యాపకుల ప్రోత్సాహంతోనే ర్యాంకు సాధించినట్లు తెలిపాడు.

విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా యూనిఫాంలు

కేతేపల్లి, జూన్ 9: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు యూనిఫాంలను సిద్ధం చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం రోజే యూనిఫాంలను అందించడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో 3280 యూనిఫాంలు స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలతో కుట్టించారు. పూర్తయిన దుస్తులను ఐకేపీ ఏపీఎం యాదమ్మ ఎంఈవో నాగయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగయ్య మాట్లాడుతూ మండల సమాఖ్య సిద్ధం చేసి ఇచ్చిన యూనిఫాంలను ఈ నెల 12వ తేదీన పాఠశాలల ప్రారంభం రోజు పాఠశాలల్లో ఉచిత పుస్తకాలతో పాటు విద్యార్థులకు అందిస్తామని అన్నారు. నిర్దేశించిన గడువులో దుస్తులను అందించిన మండల సమాఖ్యను అభినందించారు. కార్యక్రమంలో సీసీ రాజేందర్, ఎంఈవో కార్యాలయ సిబ్బంది హరి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కృష్ణారెడ్డి(ఫైల్)

నార్కట్‌పల్లి, జూన్ 9: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ కౌలు రైతు పొలంలోనే ప్రాణాలు వదిలాడు. ఆదివారం నార్కట్‌పల్లి మండలం బెండల్‌పహాడ్‌లో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెండల్‌పహాడ్ గ్రామానికి చెందిన యానాల కృష్ణారెడ్డి (58) అదే గ్రామానికి చెందిన మరో రైతుకు చెందిన సుమారు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆ పొలంలో ఉన్న బోరు మోటారుకు మరమ్మతులు చేయించాడు. ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన కృష్ణారెడ్డి ప్రమాదవశాత్తు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కృష్ణారెడ్డి కుమారుడు యానాల జాన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని నల్లగొండ జిల్లా కేంద్రాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి..

నార్కట్‌పల్లి, జూన్ 9: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల మేరకు నార్కట్‌పల్లి మండలకేంద్రానికి శివారులోని పంజాబీ దాబా ఎదురుగా సుమారు 40 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మరో ట్రాన్స్‌జెండర్ కలిసి రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్ వైపునకు అతివేగంగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వీరిద్దరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో గుర్తుతెలియని వ్యక్తికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడితో పాటు రోడ్డు దాటుతున్న ట్రాన్స్‌జెండర్‌కు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యూట్యూబ్ జర్నలిస్టు ఇంటి ఎదుట

కాంగ్రెస్ శ్రేణుల నిరసన

నల్లగొండ క్రైం, జూన్ 9 : నల్లగొండ పట్టణానికి చెందిన యూట్యూబ్ జర్నలిస్టు ఇంటి ఎదుట కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఆందోళన చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో ఓటర్లకు ఎరచూపేందుకు కాంగ్రెస్ అభ్యర్థి నుంచి ఆయన సన్నిహితుల నుంచి డబ్బులు తీసుకుని, అందుకు వ్యతిరేకంగా పనిచేశారని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ఆరోపించారు. నిరసన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. అనంతరం సదరు జర్నలిస్టును అదుపులోకి తీసుకోవడంతో పార్టీ కార్యకర్తలు ఆందోళన విరమించారు.

విచారణ చేస్తున్నాం : ఎస్ఐ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలో యూ ట్యూబ్ జర్నలిస్టుపై పలువురు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారని ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, ఆయన శ్రేయోభిలాషుల నుంచి సుమారు రూ.43 లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఆ మేరకు సదరు జర్నలిస్టును విచారిస్తున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు.

తుంగతుర్తి నియోజకవర్గంలో అవినీతి,

అక్రమాలకు తావు లేదు: ఎమ్మెల్యే



శాలిగౌరారం, జూన్ 9: తుంగతుర్తి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు తావులేదని, ప్రజలు కోరుకుంటున్న ప్రజాపాలన చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను చేసే అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొంతమంది పనిగట్టుకుని ఇష్టానుసారంగా ప్రచారం చేస్తున్నారన్నారు. వంగమర్తి మూసీ నది నుంచి ఇసుక తరలింపు ప్రభుత్వం అనుమతితోనే నడుస్తుందని, తనకు ఎలాంటి ప్రమేయం లేదన్నారు. ఎన్నికల ముందు చెప్పినట్లే తాను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు ఇసుక అక్రమ రవాణాను ఏపరిస్థితిలో అనుమతించేది లేదన్నారు. ఈ సందర్భంగా వంగమర్తి నుంచి ఇసుక తరలింపు ప్రభుత్వ జీవో కాపీని విలేకర్లకు చూపించారు. భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించిన తుంగతుర్తి ప్రజలకు సామేల్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, సీనియర్ నాయకులు పాదూరి శంకర్‌రెడ్డి, చాడ సురేష్‌రెడ్డి, మాదారం ఎంపీటీసీ నోముల జనార్ధన్, చింత ధనుంజయ్, బెల్లి వీరభద్రం, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్ర చైతన్య, బొడ్డు నగేష్, పెరుమాండ్ల నరేష్, బొల్లికొండ గణేష్, మంగదుడ్ల శ్రీనివాస్, పాకాల సతీష్, బండమీది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి తరువాత చాలామంది మహిళలు ఇళ్లకే పరిమితమై పోతారు. **జ్యోతి శ్రీవాస్తవ** పరిస్థితీ అదే. ఇంజనీరింగ్ చదివి... రాకెట్లు డిజైన్ చేసిన ఆమె కెరీర్... వివాహం అయ్యాక అమాంతం ఆగిపోయింది. కానీ బిడ్డ పుట్టాక... ఆమె ఆలోచనే మారిపోయింది. ఒక తల్లిగా గడించిన అనుభవాన్ని... ఫుడ్ బ్రాండ్‌గా మార్చి... పారిశ్రామికవేత్తగా సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. నేడు ఎందరో తల్లులకు అవగాహన కల్పిస్తున్నారు.



ఆ తల్లులకు వందనం

"అశోక విశ్వవిద్యాలయం ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం... 73 శాతం మంది భారతీయ మహిళలు మొదటి బిడ్డ పుట్టాక ఉద్యోగం వదిలేస్తున్నారట. ఆ నివేదిక చదివాక ఆశ్చర్యం అనిపించింది. ఇల్లు, పిల్లలు, బాధ్యతలంటూ ఆడవారు తమ కెరీర్ గురించి ఆలోచించడంలేదు. వెనక్కి తిరిగి చూసుకొంటే... నా పరిస్థితీ అదే. మా స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్. కెమికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశాను. వెంటనే ఉద్యోగం వచ్చింది. వృత్తిలో భాగంగా భారత సైన్యం కోసం రాకెట్లు డిజైనింగ్ చేశాను. అది నాకు ఎంతో ఇష్టమైన కొలువు. దాని కోసం నానోటెక్నాలజీ, రాకెట్ ప్రొపెల్లెంట్స్‌లో స్పెషలైజేషన్ చేశాను. అయితే అక్కడ విపరీతమైన పని. క్షణం తీరిక దొరికేది కాదు. జీతం మాత్రం చాలా తక్కువ. పనికి... జీతానికి పొంతన లేదు. దాంతో రెండున్నరేళ్ల తరువాత, అంటే 2018లో ఉద్యోగం వదిలేశాను. అనంతరం ఫ్రీలాన్సర్‌గా కొన్ని వాయుసేన ప్రాజెక్ట్‌కు పని చేశాను. ఎందుకో అది కూడా నాకు సంతృప్తినివ్వలేదు. అదే సమయంలో నాకు పెళ్లయింది. కొన్నాళ్లు ప్రాజెక్ట్స్ కొనసాగించాను.

అనుభవం నుంచి...

ఏడాది తరువాత నేను గర్భవతిని అయ్యాను. అప్పుడు మొదలయ్యాయి నా కష్టాలు. పుట్టబోయే బిడ్డ కోసమే కాదు... నా గురించి కూడా నేను శ్రద్ధ తీసుకోవాలి కదా. అందుకే ప్రాజెక్ట్స్ అన్నీ పక్కన పెట్టేశాను. బాబు పుట్టాడు. తల్లి పాలు పట్టే విషయంలో సమస్యలు ఎదురయ్యాయి. ఆ తరువాత వాడికి అందించే ఆహారం విషయంలోనూ అయోమయం. ఒక తల్లిగా పిల్లాడికి బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలనేది నా తపన. చిరుధాన్యాల్లో అయితే పోషకాలు పుష్కలంగా ఉంటాయని, కొన్ని రోగాలను నయం చేసే శక్తి కూడా వాటిల్లో ఉందని అర్థమైంది. తల్లి పాలలోని గుణాలు ఇందులోనూ ఉన్నాయి. మిల్లెట్స్ పిల్లల ఎదుగుదలను గణనీయంగా పెంచుతాయని పలు నివేదికలు పేర్కొన్నాయి. వీటన్నటి నేపథ్యంలో దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందనిపించింది.

ప్రత్యేక కోర్సులు చదివి...

బిడ్డ పోషణకు సంబంధించి పూర్తి అవగాహన కావాలి. అందు కోసం యునిసెఫ్ 'ఐవైసీఎఫ్' (ఇన్‌ఫ్యాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్) కోర్సు చదివాను. దాంతోపాటే 'చైల్డ్ అండ్ మెటర్నల్ న్యూట్రిషన్' సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాను. ఆ తరువాత నాలాంటి తల్లులకు పిల్లల ఆరోగ్యం, పోషకాహారం గురించి అవగాహన కల్పించేందుకు ఇన్‌స్టాగ్రామ్‌లో 'లిటిల్ చెర్రీ మామ్' పేరుతో పేజీ ఒకటి తెరిచాను. కెమికల్ ఇంజనీరింగ్ చదివిన నాకు ఫుడ్ ప్రాసెసింగ్ మీద అవగాహన ఉంది. భారీ ప్రాజెక్టులకు పని చేసిన అనుభవం ఉంది. అందుకే ఎవరో తెలిసీ తెలియక అన్న మాటలు నేను పట్టించుకోలేదు. నేను అందించే సమాచారం కొందరు చంటి బిడ్డల తల్లులకైనా చేరితే చాలనుకున్నాను.

ఆరంభంలో కొందరు నన్ను ఎగతాళి చేశారు. హేళనగా మాట్లాడారు. 'ఈమెకేం తెలుసు' అన్నట్టు కొందరు బంధువుల, స్నేహితులు నా మీద జోక్‌లు వేశారు. 'నాడు మంచి ఉద్యోగం వదిలి తప్పు చేశావు' అన్నారు. అవేవీ పట్టించుకోలేదు.



మా అబ్బాయి పేరుతో...

పసి పిల్లల ఎదుగుదలకు సంబంధించి ఆయుర్వేదంలో పేర్కొన్న వివిధ రకాల మూలికల గురించి కూడా చదివాను. వాటి ఔషధ గుణాలకు సంబంధించిన సమాచారం సేకరించి పెట్టుకున్నా. వీటన్నిటినీ క్రోడీకరించి, మిల్లెట్స్‌తో రోజుకు మూడు రకాల వంటలు ప్రయత్నించాను. పోషక విలువలే కాదు, రుచి కూడా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నా. ఎందుకంటే రుచికరంగా లేకపోతే పిల్లలు ముట్టుకోరు. అలా కొన్ని రెసిపీలు సిద్ధమయ్యాక మా అబ్బాయి పేరుతో చిరుధాన్యాల ఆధారిత 'లిటిల్ చెర్రీ ఫుడ్స్' కంపెనీ ప్రారంభించాను. చిన్నారులకు నాణ్యమైన, పోషక విలువలు ఉన్న, తాజా ఆహారం అందించాలనే లక్ష్యంతో దీన్ని నెలకొల్పాను.

సవాళ్లు ఎదురైనా...

ఒకానొక దశలో ఇక నా వృత్తిగత జీవితం ముగిసిపోయిందని అనుకున్నా. ఆ సమయంలోనే ఇన్‌స్టాలో నేను పెట్టిన పోస్టులకు క్రమంగా వీక్షకులు పెరిగారు. కొద్ది రోజుల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటింది. అది నాకు నూతనోత్తేజాన్ని ఇచ్చింది. ఆ ఉత్సాహంతోనే కంపెనీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చాను. అయితే దానికి డబ్బు ఎక్కడి నుంచి తేవాలి? అది పెద్ద సమస్యగా మారింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మావారు నాకు అండగా నిలిచారు. కొంతవరకు ఆర్థిక వనరులు సమకూర్చారు. మిగిలిన పెట్టుబడి కోసం నేను ఆన్‌లైన్‌లో వర్క్‌షాప్స్ నిర్వహించాను. కానీ ఇంకా లోటు. దాంతో బ్యాంకు లోను తీసుకొని వ్యాపారం మొదలుపెట్టాను. సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ ప్రాంతాల్లోని నవజాత శిశువుల తల్లులకు చేరువయ్యే ప్రయత్నం చేశాను. తొలి విడత ఉత్పత్తులు మార్కెట్‌లోకి విడుదల చేసే నాటికి మావద్ద యాభై వేల పైచిలుకు తల్లులతో కూడిన అతిపెద్ద సమూహం ఒకటి ఏర్పడింది. ఆ తరువాత నా పని సులువైంది. కష్టానికి ఫలితం దక్కింది. ఏడాది తిరక్కుండానే మా బేబీ ఫుడ్స్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు మా టర్నోవర్ కోటి రూపాయలు దాటింది. నేటికీ మిల్లెట్ ఫుడ్ మీద అవగాహన కల్పిస్తున్నాను. వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాను. సంపాదన, సంతృప్తి... రెండూ దక్కుతున్నాయి. ఇదంతా అంతమంది తల్లులు నాపై ఉంచిన నమ్మకం. ఆ తల్లులందరికీ నా వందనం."

మార్పు యోధులు...

వారియర్స్ వితవుట్ ఎ కాజ్...

పేదలకు, అణగారిన వర్గాలకు ఏదైనా మేలు చేద్దామనే తపనతో నలుగురు కాలేజీ అమ్మాయిలు ఏర్పాటు చేసిన ఈ ఎన్జీవో.. ఇప్పుడు మూడువందల మందికి పైగా వాలంటీర్లతో... దేశంలోని వివిధ నగరాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్పందించే మనసుంటే... సాయం చెయ్యడానికి వయసుతో, ఆర్థిక స్థాయితో సంబంధం లేదని నిరూపిస్తోంది ఈ యువ బృందం.



2020... జన జీవనంలో కొవిడ్ మహమ్మారి రేపిన అల్లకల్లోలాన్ని చూసి చలించిపోయారు అనూష అత్రి, భవానీ సింగ్, ఖుషీ సింగ్, వంశికా మెహతా. ఆ నలుగురు అప్పుడే టీనేజీ దాటిన స్నేహితులు. ఢిల్లీలో చదువుకుంటున్నారు. కనీస అవసరాలు తీరక అల్లాడిపోతున్న ప్రజానీకానికి తమ వంతుగా ఏదైనా చెయ్యాలనుకున్నారు. తమ పాకెట్ మనీని పోగేసి... మాస్కులు, శానిటైజర్లు కొని... మురికివాడల ప్రజలకు పంచిపెట్టారు. ఆ తరువాత నిత్యావసరాలను కూడా అందించారు. ఈ క్రమంలో... ఆ ప్రజల అత్యవసరాలను ప్రత్యక్షంగా గమనించి, అర్థం చేసుకున్నారు. సామాజిక సంక్షేమం కోసం ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించి, రిజిస్టర్ చేశారు. అదే 'వారియర్స్ వితవుట్ ఎ కాజ్'. "ఒక మార్పు తేవడానికి మనం దోహద పడడం వెనుక ఎలాంటి కారణం ఉండవలసిన అవసరం లేదనేది మా ఉద్దేశం. తోటివారి కష్టాలకు స్పందించి, వారికి సాయం చేసే సున్నితతత్వం సమాజంలో పెరగాలి. ఆ దిశగా చైతన్యాన్ని వ్యాప్తి చెయ్యాలని, దీర్ఘకాలంలో... పేద వర్గాలను వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడేలా చెయ్యాలని అనుకున్నాం. మురికివాడల్లో మా ప్రయత్నాన్ని ప్రారంభించాం" అని వివరించారు ఆ ఫ్రెండ్స్. కేవలం ఏదో ఒక అంశానికే పరిమితం కాకుండా... వైద్య శిబిరాల ఏర్పాటు, ఎడ్యుకేషన్ వర్క్‌షాపుల నిర్వహణ, శానిటరీ ప్యాడ్స్, ఆహారం, దుస్తులు, స్టేషనరీ, పుస్తకాల్లాంటివాటి పంపిణీతో సహా... విస్తృతమైన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో...

"అవసరాలు తీర్చడం, ఆసరాగా నిలబడడం, విద్యకు, ఉపాధికి సహకారం అందించడం... ఇవీ మా ప్రాధాన్యాలు. అదే సమయంలో మౌలిక సదుపాయాలను, ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నాం. విద్యుత్, పారిశుధ్య సదుపాయాలను అందుబాటులోకి తేవడం కూడా దీనిలో భాగం. మొత్తంగా వారి జీవన నాణ్యతను పెంచడానికి దోహదం చేస్తున్నాం" అని వారు చెబుతున్నారు. మురికివాడల్లో పిల్లలకు పాఠాలు చెప్పండం, ఆర్థిక విషయాలపై అవగాహన కల్పించడంతోపాటు ఢిల్లీలోని సిఆర్ఆర్ఐ మురికివాడలో కుట్లు, అల్లికలు లాంటి విషయాల్లో దాదాపు ముప్ఫై మంది మహిళలకు ఈ ఎన్జీవో శిక్షణనిచ్చి.. ఉత్పత్తులు తయారు చేయిస్తోంది. వాటిని మార్కెట్లలో, ఎగ్జిబిషన్లలో విక్రయించి... ఆ మహిళలకు శాశ్వతమైన ఉపాధి కలిగేలా చర్యలు తీసుకుంది. వీధి వర్తకులకు, చిన్న బండ్ల మీద సరుకులు అమ్ముకొనేవారికి ఎండ తీవ్రత నుంచి ఊరట కలిగించడానికి... కిందటి ఏడాది ఈ ఫ్రెండ్స్ ప్రారంభించిన 'బీట్ ది హీట్' కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. దాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా... పెద్ద గొడుగులు, టోపీలు, శీతల పానీయాలు, నీరు పంపిణీ చేస్తున్నారు. "వివిధ ప్రాంతాల్లో యాభైవేల మందికి వాటిని అందజేశాం. ఈ ఏడాది ఇప్పటికే అయిదు వేలమందికి పైగా ప్రయోజనం పొందారు. మరెంతో మందికి మా సేవలు అందించాల్సి ఉంది. దీనిలో ప్రజలను కూడా భాగస్వాముల్ని చేస్తున్నాం" అని చెబుతున్న 'వారియర్స్' ద్వారా గత మూడేళ్ళలో వివిధ సాయాలు అందుకున్నవారి సంఖ్య నాలుగు లక్షలకి పైనే.

నవ్య | చిత్రజ్యోతి

ఈ పుట్టిన రోజు ఎంతో ప్రత్యేకం



వెండి తెరపై 'సమరసింహ'మైన బాలకృష్ణ విశ్వరూపం చూసి అభిమానులు ఏనాడో తరించి పోయారు. ఆ హోరులో బాక్సాఫీస్ వసూళ్ల పండగ చేసుకుంది. ఆ తాకిడికి రికార్డులు దాసోహం అయ్యాయి.. బాలయ్య చేతిలోని ఆయుధమే కాదు కంటి చూపు, మాట కూడా పదునే... అందుకే ఈ నట 'సింహా'నికి జనం నీరాజనాలు పట్టారు. రాజకీయాల్లోకి అడుగు పెడితే అక్కడ కూడా ఆయన్ని ఘనంగా ఆదరించారు. మూడో సారి కూడా ఆయన్ని శాసన సభ్యుడిగా గెలిపించి హ్యాట్రిక్ వీరునిగా నిలబెట్టారు. ఒక సినీ హీరో ఇలా వరుసగా మూడు సార్లు అసెంబ్లీకి ఎన్నిక కావడం చరిత్రలో ఇదే ప్రథమం. అంతకు ముందు ఎన్టీఆర్‌కు ఇటువంటి రికార్డ్ ఉన్నా ఆయన సినిమాల నుంచి రాజకీయ రంగంలోకి వెళ్లిన తర్వాత ఆ ఘనత సాధించారు. కానీ సినీ రంగంలో ఉంటూనే రాజకీయ రంగంలో కూడా రికార్డులు క్రియేట్ చేసిన ఏకైక హీరో బాలయ్యే. శాసన సభ్యుడిగా హ్యాట్రిక్ విజయం సాధించిన నేపథ్యంలో వస్తున్న పుట్టిన రోజు (జూన్ 10) కావడంతో ఈ రోజు చాలా ప్రత్యేకతను సంతరించుకుంది.




తండ్రి ఎన్టీఆర్ దర్శకత్వంలో 'తాతమ్మకల' (1974) చిత్రంతో ప్రారంభమైన బాలకృష్ణ చలన చిత్ర యాత్ర ఇంకా నిర్విఘ్నంగా, నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. ఆయనతో నటన ప్రారంభించిన హీరోలు, తర్వాత వచ్చిన వారూ మధ్య మధ్యలో గ్యాప్ తీసుకున్నా బాలయ్య మాత్రం ఆగిపోలేదు, అలసిపోలేదు. ఈ ఐదు దశాబ్దాల నట జీవితంలో భారీ విజయాలే కాదు..కొన్ని అపజయాలు కూడా ఉన్నాయి.. అపజయానికి కుంగిపోలేదు. విజయానికి దగ్గర దారులు వెదుకుతూ రాజీ పడలేదు.

భారతీయ నట వారసుల్లో నందమూరి బాలకృష్ణ ప్రత్యేకత వేరు.. తన సమకాలిక హీరోలు సాంఘిక చిత్రాలకే పరిమితం కాగా పౌరాణిక, జానపద, చారిత్రక, సైన్స్ ఫిక్షన్ చిత్రాల్లో సైతం బాలకృష్ణ నటించి తండ్రి ఎన్టీఆర్‌కు తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారు.

తెలుగు భాష పట్ల బాలకృష్ణకు ఎంతో గౌరవం. స్వచ్ఛమైన ఉచ్చారణతో, తెలుగుతనం ఉట్టిపడే పదాలతో ఆయన డైలాగులు చెప్పే తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. అలాగే ఈ నందమూరి అందగాడు ముఖ కవళికల్లో, అనర్గళంగా సాగే మాటల్లో పౌరుషం శివమెత్తి నాట్యం చేస్తుంటుంది. అందుకే బాలయ్య డైలాగులు అంటే ఫ్యాన్స్ లో అంత క్రేజ్.. ఇక ఆయన కత్తి పట్టి రంగంలోకి దిగితే యాక్షన్ పంట పండినట్లే. తనకు ఉన్న ఇమేజ్‌కి భిన్నంగా నిజ జీవితంలో బాలకృష్ణ వ్యవహరిస్తుంటారు. నలుగురిలో మామూలుగా కనిపిస్తే హీరోగా తన ఇమేజ్ దెబ్బ తింటుందేమో అనే అభద్రత భావం బాలయ్యలో బొత్తిగా కనిపించదు. తన కారుని తనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళడం ఆయనకి ఒక సరదా. అలాగే అందరితో జోవియల్‌గా మాట్లాడుతుంటారు.

క్రమశిక్షణ.. ముక్కుసూటి మనస్తత్వం

బాలకృష్ణ తండ్రిలాగే క్రమశిక్షణకు ప్రాణం ఇస్తారు. అలాగే ఆయన నిర్మోహమాటి. ముక్కుసూటి మనస్తత్వం కలవారు. నాన్చుడు వ్యవహారం ఆయనకి నచ్చదు. ఏ విషయమైనా వెంటనే తేల్చేయాల్సిందే. నటన అనేది ఒక ఉద్యోగంగా భావించకుండా ఓ కళగా ఆరాధించే వ్యక్తి కావడం వల్లే ఐదు దశాబ్దాల నుంచి విరామం లేకుండా పనిచేస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు.



రామోజీ సేవలు అజరామరం



అక్షర యోధుడు రామోజీరావు స్మృతికి నివాళిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆదివారం సంస్మరణ సభ నిర్వహించింది. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని రామోజీరావు సేవలు అజరామరమని కొనియాడారు. నిర్మాత కేఎస్ రామారావు, చదలవాడ శ్రీనివాసరావు, స్రవంతి రవికిషోర్, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, విజయేంద్రప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, టీఎఫ్‌పీసీ అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్, సెక్రటరీ ప్రసన్నకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed and published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press,Arjalabai(vill),Survey No:1617,Addanki Byepass Road, Nalgonda-508001, Ph No:-08682-248455,248244 Editor : K. Srinivas .
RNI No. APTEL/2004/13036 . Managing Director : Vemuri Radha Krishna Founder : K.L.N.Prasad